
సుప్రసిద ఆసియా కథలు-6

# నా కొత్త బాబాయి

(జపాన్ కథ)

చుయో సుప్



నేను చిన్నపిల్లని. నాకు ఆరేళ్ళే.

నా పేరు ఓక్-హీ. మా కుటుంబములో ఇద్దరే—మా అమ్మ, నేనూ.

నేనూ, ఓహెూ, ఆగండి, ఇంకొక మనిషి ఉన్నాడు...... మా మామయ్య. హైస్కూల్లో చదువుకుంటున్నాడు. ఎప్పుడూ ఇంట్లో ఉండడు. ఎక్కడో అక్కడ తిరుగుతూనే ఉంటాడు. ఒక్కొక్కప్పుడు అతను వారాల తరబడి కనిపించడు. అందుకని అతన్ని మరిచిపోతూ ఉంటాను. మా అమ్మ చాలా అందగత్తె. ప్రపంచంలోకెల్లా అందమయిన ఆవిడట. ఆవిడ కిప్పుడు 24 ఏళ్ళు. ఆవిడ విధవ.

నేను పుట్టటానికి నెల రోజుల ముందు మా నాన్న పోయాడని మా పక్కింటి అమ్మమ్మ చెప్పింది. అంతకి ఒక సంవత్సరం కిందనే మా అమ్మని పెళ్లి చేసుకున్నాడు. మా నాన్న ఇక్కడ ఉపాధ్యాయుడుగా ఉండేవాడు. ఇలాగని మా అమ్మమ్మ చెప్పింది. ఆవిడ ఇంటికి పక్కనే ఉన్న ఈ ఇల్లుని మా నాన్న కొన్నాట్ట. మా అమ్మా, నాన్నా ఇద్దరూ ఇక్కడే ఉండేవాళ్లు ఆయన చచ్చిపోయే వరకూ. మా నాన్నని నేను చూడనే లేదు. కాని, ఆయన బొమ్మ నొకసారి చూశాను. బాగా ఉన్నాడు.

సరిగ్గా చెప్పాలంటే మా కుటుంబంలోనూ అమ్మా, నేనూ, ఇద్దరమే కాని మా ఇంట్లో అదనంగా కొన్ని గదులుండేవి — మా అమ్మకి పనుల్లో సాయపడే మనిషి కావాల్సి వచ్చింది. అందుకని మా మామయ్య వచ్చాడు.

ఈ ఏడు వసంత ఋతువు వచ్చే సమయానికి నన్ను చిన్న పిల్లల బడిలో చేరిపిస్తానంది మా అమ్మ. నాకు చాలా సంతోషం వేసింది. నేను ఇంటికి వచ్చాను. మా పెద్దమామయ్య .... అంటే మాతో ఉండే మామయ్య అన్నయ్య .... ఎవరో కొత్త మనిషితో, బయట గదిలో మాట్లాడుతున్నాడు. నన్ను చూడగానే మా మామయ్య కొత్తాయనకి ప్రణామం చెయ్యమన్నాడు. నేను సిగ్గుపడ్డాను కాని, ఆ కొత్తమనిషి మా మామయ్యని ఈ అమ్మాయి నీ మేనకోడలా అని అడిగాడు. మా మామయ్య చెప్పాడు: "అవును. మా చెల్లెలి కూతురు, కొయంగ్‌సన్ ఈమె పుట్టకముందే పోయాడు."

కొత్తాయన అన్నాడు, "ఓక్—హీ, ఇలా రా నీ కళ్లు అచ్చు మీ నాన్నవే!"

"ఓహెూ, ఓక్‌హీ, ఇలారా!" అన్నాడు మా మామయ్య. "నువ్వొక పెద్దమ్మాయి వైపోయావు. ఈయనకి వంగి ప్రణామం చెయ్యి. మీ నాన్న స్నేహితుడు. ఈ గదిలోనే ఉంటా డింక."

ఆ గదిలో ఆయన ఉంటాడని విని సంతోషించాను. ఆయన ముందు నుంచుని, వినయంగా ఒకసారి ముందుకి వంగి, తోటలోకి పారిపోయాను.

ఈ కొత్త బాబాయి నా కింతకుముందు తెలీదు. చాలా మంచివాడు. ఊళ్లో పెద్దవాళ్లు అనుకునేవాళ్లు, మా నాన్నకీ, ఈయనకీ మంచి స్నేహమనీ, ఈయనెక్కడో దూరదేశంలో చదువుకుని వచ్చాడనీ. మా ఊరి స్కూల్లో పంతులుగా కుదిరాట్ట. అక్కడ హెూటల్ లేదు. కాబట్టి మాయింటికి వెళ్లమని చెప్పారుట ఎవరో.

ఈ కొత్త బాబాయి దగ్గిర చాలా బొమ్మల పుస్తకాలుండేవి. ఆయన గదిలోకి వెడితే నన్ను ఒళ్లో కూర్చోపెట్టుకుని బొమ్మలు చూపెట్టేవాడు. ఎప్పుడయినా మిఠాయి పెట్టేవాడు. ఒక రోజు భోజనం ముగించిన తరువాత ఆయన దగ్గరికి వెళ్లాను. ఆయన ఇంకా భోజనం చేస్తున్నాడు. నేను పక్కనే కూర్చుని ఆయన భోజనం చేస్తూ ఉంటే చూస్తూ ఉండిపోయాను. నీకు అన్నం తర్వాత అన్నిటికన్నా ఇష్టమయిన దేమిటి అని అడిగాడు. నాకు గుడ్లంటే అన్నిటికన్నా ఇష్టం అని చెప్పాను. వెంటనే ఆయన తన బల్లమీద ఉడకబెట్టిన గుడ్డు ఒకటి ఉంటే తీసి ఇచ్చాడు. నేను దాన్ని తీసుకుని తిన్నాను. తర్వాత ఆయన కేది ఎక్కువ ఇష్టం అని అడిగాను. చిరునవ్వుతో "నాకూ గుడ్లే ఎక్కువిష్టం" అన్నాడు. నాకు సంతోషం వేసింది. మా అమ్మతో కూడా చెప్తానన్నాను.

"వద్దు. చెప్పక!" అన్నాడు ఆయన. కాని, నేను మా అమ్మ గదిలోకి వెళ్లి చెప్పేశాను. ఎందుకంటే మా అమ్మ అప్పటినుంచి ఎక్కువ గుడ్లు తీసుకొచ్చేది.

నేను 'కిండర్ గార్డెన్' (చిన్నపిల్లల బడి) కి వెళ్లటం మొదలుపెట్టాను. పాట్టం, నాట్యం చెయ్యటం, ఆటలు ఆడటం నేర్చుకున్నాను. మా టీచరుకి 'ఆర్గన్' (పెద్ద హార్మనీ వంటిది) వాయించటం బాగా వచ్చు. కిండర్‌గార్డెన్‌లో 'ఆర్గన్' 'చర్చ్' లో దానికన్నా చిన్నది కాని వినటానికి బావుండేది. ఇలా ఉండగా, మా ఇంట్లో పైన ఒక గదిలో ఆర్గన్ లాంటిదే ఒకటి చూసి మా అమ్మని అడిగాను, ఏమిటని. అది ఆర్గన్ అని చెప్పింది మా అమ్మ.

ఆవిడ దాన్ని వాయించగా ఎప్పుడూ చూడ లేదు నేను. అందుకని అడిగాను : "నీకు ఆర్గన్ వాయించటం వచ్చా?" అని. ఆమె కొంచెం కంగారుపడి ఇలా చెప్పింది : "ఇది మీ నాన్న నాకు కొని ఇచ్చిన ఆర్గన్. ఆయన పోయింతర్వాత దాన్ని ముట్టుకోనయినా లేదు నేను!" ఏడుపు వచ్చినంత పనయింది ఆవిడకి. సరేనని కొంచెం మిఠాయి కోసం అడిగాను. ఇద్దరం లోపలికి వెళ్లిపోయాము.

మా కొత్త బాబాయితో మాట్లాడాలని నాకుంది కాని మా అమ్మ ఊరికే వెళ్లి అతన్ని విసిగించద్దని చెప్పింది. నిజం చెప్పాలంటే నేనాయన్ని విసిగించేదాన్ని కాదు. ఆయనే నన్ను విసిగించేవాడు. మా ఇంటికి వచ్చిన నెల రోజుల తర్వాత నాతో ఇలా మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నీ కళ్లు మీ నాన్నవే కాని ఈ చక్కటి ముక్కు మీ అమ్మవైపు నుంచి వచ్చుండాలి. ఈ నోరు అంతే. నిజమేనా? మీ అమ్మ కూడా నీ అంత అందమయినదా?" నే నన్నానూ, "మా అమ్మని చూడలేదా మీరు?" ఆయన జవాబు చెప్పలేదు. "లోపలికి రండి మా అమ్మని చూడచ్చు" అన్నాను నేనే.

"అబ్బే నాకు చాలా పనుంది. ఇప్పుడు రాలేను." అని నా గడ్డంమీద ముద్దు పెట్టుకుని ఏవేవో కబుర్లు చెప్పాడు : "ఈ కోటు ఎవరు కుట్టారు? మీ అమ్మ పక్కనే పడుకుంటావా నువ్వు?" అని అడిగాడు. అంత పనిగా ఉంటే ఇంతసేపు కబుర్లెలా చెప్తాడు?

ఒక తమాషా. నేనంటే ఆయన కెంతో ఇష్టం,

తిప్పుడూ నన్ను ముద్దు చేసేవాడు కాని మా చిన్న మామయ్య ఉంటే మాత్రం మారిపోయేవాడు. ముద్దుపెట్టుకోవటం, కబుర్లు చెప్పటం ఉండేవి కావు.

ఒకరోజు, శనివారం మధ్యాహ్నం తనతో ఊరి వెనక కొండమీదికి రమ్మన్నాడు. ఈ ఆహ్వానం నాకు సంతోషం కలిగించింది. వెంటనే స్వీకరించాను. కాని, ఆయన "మీ అమ్మని అడిగి రా!" అన్నాడు. మా అమ్మ సరేనంది. నా మొహం కడిగి తల దువ్వి, పంపించేముందు ఒకసారి కావలించుకుని గట్టిగా అంది : "మరీ ఆలస్యం చెయ్యక!" అని. ఆయనకి కూడా వినిపించిం దనుకుంటాను. ఇద్దరం కొండెక్కి కింద ఊరినీ, రైల్వే స్టేషన్నీ చూశాము. మా కొత్త బాబాయి గడ్డిమీద పడుకుంటే నేను ఇటూ అటూ పరుగెత్తి ఆడుకున్నాను. కొన్ని గడిపోచలు కోసి వాటితో ఆయనకి చక్కిలి గింతలు పెట్టాను. కిందకి దిగివచ్చేటప్పుడు నా చెయ్యి పట్టుకుని నడిపించుకుని వచ్చాడు. దారిలో నాతో కిండర్ గార్డెన్ చదువుకునే పిల్లలు కొందరు కనిపించారు. ఎవరో, "ఓహో, వాళ్ల నాన్నతో నడిచి వెళ్తోంది" అన్నారు.

నాకు సిగ్గేసింది. ఆయన నిజంగా మా నాన్నే అయితే బావుండు ననుకున్నాను. మా ఇంటి గుమ్మం చేరగానే అన్నాను. "మీరు నిజంగా మా నాన్నయితే బావుంటుంది!" అని. ఆయన ముఖం ఎర్రగడ్డలాగ అయిపోయింది. తల ఆడిస్తూ అన్నాడు: "అలాంటి మాట అనకూడదు!" నాకు భయంవేసి నా గదిలోకి "వెళ్లిపోయాను. మా అమ్మ, "ఎంతదాకా వెళ్లా" రని అడిగితే చెప్పకుండా వెక్కి వెక్కి ఏడ్చాను మర్నాడు ఆదివారం. ఒట్టలు వేసుకుని చర్చికి వెళ్లటానికి సిద్ధంగా ఉన్నాను. మా అమ్మ ఇంకా తయారుకాలేదు. నెమ్మదిగా మా బాబాయి గది దగ్గరికి వెళ్లి లోపలికి తొంగిచూశాను. నామీద ఇంకా కోపంగా ఉన్నాడో లేదో తెలుసుకుందామని. బల్ల దగ్గర ఏదో రాసుకుంటున్నాడు. నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. నాకు హాయనిపించింది. నావంక జాగ్రత్తగా చూసి, "చాలా బావున్నావు. ఎక్కడికి బయలుదేరావు ?"

"మా అమ్మతో చర్చికి వెడుతున్నాను."

"చర్చా ? ఏ చర్చి ?"


"ఇక్కడికి దగ్గరే ఉందే, ఆ చర్చి !"

ఇంతలో మా అమ్మ పిలిస్తే వెళ్లిపోయాను. మేము చర్చిలో కూర్చున్నప్పుడు ముందు ఒక పాట పాడారు, తర్వాత ప్రార్థన మొదలుపెట్టారు. అక్కడ వారందరూ తలలు వంచి ఉండగా, ఈయన జ్ఞాపకం వచ్చాడు. చర్చిలో ఉన్నాడేమో, అనుకున్నాను. తల ఎత్తి చూట్టూ చూశాను. మగవాళ్లు కూర్చునే చోట కనిపించాడు. నాకు సంతోషం వేసింది. తమాషా ఒకటి ఏమిటంటే ఆయన తక్కిన పెద్దవాళ్లలాగ తలవంచి లేడు. చుట్టూ చూస్తున్నాడు. నేను అతనివైపు చూసి చిరునవ్వు నవ్వాను కాని, అతను సమాధానంగా నవ్వలేదు. నన్ను చూడలేదేమోనని చెయ్యెత్తి ఆడించాను. నన్ను గమనించాడు, వెంటనే తల వంచేశాడు. ఆ క్షణం మా అమ్మ నేను ప్రార్థించటం లేదని చూసి నన్ను కిందికి లాగింది. నేను ఆమె చెవిలో అన్నాను : "ఆ బాబాయి ఇక్కడే ఉన్నాడు !" అమ్మ మొహం ఎర్రబడింది. ఆరోజు ఫాదరీ ప్రసంగం ఏమీ బావుల్లేదు. అంతా అయిపోయేదాకా మా అమ్మ నన్ను చూసి నవ్వనే లేదు. ఫాదరీ నుంచున్న చోటువైపే స్థిరంగా చూస్తూ ఉండిపోయింది. కోపంగా ఉందనిపించింది. ఆయన వైపు చూశాను. ఆయనా నవ్వటంలేదు. నన్ను చూడనట్లే నటించాడు. నేను మగవాళ్ల కూచునే వైపు తిరిగినప్పుడల్లా మా అమ్మ నన్ను ఫాదరీ వైపు తిప్పేది. నాకూ కోపం వచ్చింది. ఏడ్చేద్దామనుకున్నాను. కాని మా కిండర్ గార్డెన్ టీచర్ పక్కనే కనిపించింది. అందుకని ఏడవటానికి వీలు లేకపోయింది.

నేను కిండర్ గార్డెన్‌లో చేరినప్పుడు మా చిన్న మామయ్య రోజూ బడిలో దింపి, తర్వాత ఇంటికి తీసుకుపోయేవాడు. పోను పోను నా అంతట నేనే వెళ్లగలిగేదాన్ని. నేను ఇల్లు చేరుకునేసరికి మా అమ్మ ఇంటి గేటు దగ్గిర నుంచుని నన్ను ఎత్తుకుని లోపలికి తీసుకుపోయేది. ఒకరోజు నేను కిండర్ గార్డెన్‌నుంచి తిరిగి వచ్చేటప్పటికి మాత్రం అక్కడ లేదు. పక్కింటి అమ్మమ్మగారి దగిరకి వెళ్లి ఉంటుంది. నాకు మాత్రం ఎందుకో విచారం వేసింది. వంటరిగా అనిపించింది. ఆవిడ్ని దడిపిద్దామనుకున్నాను గాని, నేను ఏదో చేసేందుకు ముందే మా అమ్మ గొంతుక వినిపించింది బయటినించి. "నా చిట్టితల్లి ఇంట్లో ఉందా ?" నా చెప్పులు తీసేసి లోపలి గదిలోకి పారిపోయాను. అక్కడ బీరువా తెరిచి అందులో దాక్కున్నాను. కొంతసేపు తర్వాత ఆమె కంఠం మళ్లీ వినిపించింది. ఇప్పుడు గదిలోనే ఉంది. "ఓక్—హీ! ఇక్కడే ఉన్నావా ?" ఆపైన మళ్లీ, "అరె, ఇక్కడి కింకా రాలేదు !" అన్న మాటలు వినిపించాయి. మా అమ్మ నాకోసం గేటు దగ్గరికి నడిచి వెళ్లిపోవటం విన్నాను. నాకు సంతోషం వేసింది. నా తెలివికి నేనే నవ్వుకున్నాను. కొంతసేపటి తర్వాత ఏదో గొడవ జరుగుతున్న శబ్దాలు వినిపించాయి. మా అమ్మ గొంతుక, మా చిన్న మామయ్య గొంతుక వినపడ్డాయి.

చివరికి మా అమ్మ వెక్కివెక్కి ఏడవటం విన్నాను. బయటికి వచ్చేద్దామనుకున్నాను కాని ఆమెకి పడిన శిక్ష చాలలేదని అలాగే అక్కడ పడుకున్నాను. చాలా ఉక్కగా ఉంది. నిద్రపోయి ఉంటాను. నేను లేచేసరికి చీకటిగా ఉంది. భయం వేసి ఏడుపు మొదలుపెట్టాను. మా అమ్మ గొంతుక వినిపించింది. బీరువా తెరిచి నన్ను బయటికి లాగింది. మొదట నన్ను నాలు గంటించింది. ఏడ్చాను. తర్వాత నన్ను గట్టిగా కావిలించుకుని :

30వ పేజీ చూడండి



ఈ చెత్తని కాలపటంవల్ల వచ్చే ప్రమాదాలను గురించి చెప్పి చెప్పి చూశాను. లాభం లేకపోయింది. ఏమిట్రా అంటే, నాకూ ఒకటి ఇచ్చింది కాలవమని. వద్దన్నాననుకోండి.

అప్పటికే మిస్ కీలర్‌లో స్పష్టంగా వస్తున్న మార్పును గమనించాను. ఆమె అందం ఏవిధంగా నమసిపోతోందో ఇంతకిముందే చెప్పాను. కాని క్రమంగా ఆమె పురుష సంపర్కం, పరమపద సోపానపటం లాంటి ఆటల విషయం తప్ప మరెందులోనూ ఆసక్తి చూపటం ఆపేసింది.

పని చెయ్యటం మానుకుంది. డబ్బుకి కూడా ఇబ్బంది పడుతున్నట్లు కనిపించింది. అదృష్టవశాత్తు ఆమె స్నేహితులని సత్కరించే సమయానికి నేను ఉండేవాడినికాదు కాని, తెల్లవారున మాత్రం జరిగిన

## క్రిస్టీన్ కీలర్ కథ

దానికి కావలసినంత సాక్ష్యం దొరికేది.

ఒకటి రెండుసార్లు నేను ఆలస్యంగా ఇంటికి వెళ్ళినప్పుడు ఆమె కోసం వచ్చేవారిని చూసే అవకాశం కలిగింది. ఆమెకి నచ్చిన మగవారి 'రకం' కూడా మారింది.

చాలా నీచంగా కనిపించారు. శుభ్రం అనల్లేనివారు, గడ్డాలు గీసుకోని వారు వచ్చి తలుపు తట్టేవారు. లేదా మిస్ కీలర్ (బహుశ) ఇచ్చిన తాళం చెవితో తలుపు తామే తెరుచుకుని లోపలికి వచ్చేవారు.

చాలామంది నీగ్రోజాతివారు వచ్చేవారు.

పొద్దున నేను వచ్చేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉండేది. పార్టీ జరిగిన తర్వాత మిగిలే చెత్తతోబాటు సిగరెట్ పీకలు కూడా కనిపించేవి.

ఇక మిస్ కీలర్—మిట్ట మధ్యాహ్నందాకా నిద్రపోయేది. ఆమెని లేపుదామని నేను ప్రయత్నం చేసేవాడినికాదు. నా కాలం వృధా అని నాకు తెలుసు.

దాని బదులు అంతా శుభ్రం చేసే వాడిని, నా పని ఊడి పోకుండా ఇంకా ఎంతకాలం ఉంటుందా అని ఆలోచిస్తూ.

నిజం చెప్పాలంటే నేను విసిగిపోయాను. ఒకరోజు వచ్చి మిస్ కీలర్ ఒక మగ మిత్రుడితో కలిసి స్నానం చేస్తోందని తెలుసుకుని, ఆమె అవినీతి లోతుల్ని అందుకుంది కదా అనుకున్నాను. టబ్‌లో కూర్చుని వా రిద్దరూ కేవలం 'షాంపేన్' (ఒక రకం మద్యం) సేవిస్తున్నారన్న సంగతి తెలిసి కూడా పని వదులుకుందామన్న నిర్ణయం మార్చుకోలేదు నేను. ★

## ఆసియా కథ

27 వ పేజీ తరువాయి

“ఓక్—హీ, నా తల్లీ! క్షేమంగా ఉన్నా వదే చాలు. అమ్మ, ఇదుగో ఏడవక! బాగానే ఉన్నావుగా, చెప్పు! నాతో ఉంటే చాలు, అంతా సరిగ్గా ఉంటుంది. అంతే నా క్కావల్సింది. ఇంకెవరూ అక్కర్లేదు.!”

మరునాడు కిండర్ గార్డెన్ నుంచి తిరిగివస్తూ నేను చేసిన పని గుర్తుకి వచ్చింది. మా అమ్మమీద జాలి కలిగింది. ఇవాళ ఆమెకి సంతోషం కలిగే పని ఏదయినా చెయ్యాలి. ఏమిటి ? కిండర్ గార్డెన్ గదిలో ఉంచిన పూల సంగతి జ్ఞాపకం వచ్చింది. ఆ గదిలోకి తిరిగి వెళ్లాను. ఎవరూ లేరు. టీచర్ కూడా లేరు. రెండు పూలు తీసుకుని ఇంటికి పరుగెత్తాను. మా అమ్మ నన్ను దగ్గరికి తీసుకుని “ఎంత చక్కటి పూలు ! ఎక్కడివి ?” అంది. ఏం చెప్పాలో తెలీలేదు నాకు. నిజంగా చెప్పటానికి భయపడ్డాను. నేను చెప్పిన జవాబుకి నాకే ఆశ్చర్యం వేసింది. “బయట గదిలో కొత్త బాబాయి నీకు ఇవ్వమని యిచ్చాడు.....” మా అమ్మ బెదిరిపోయినట్లు కనిపించింది. ఆమెకి నోట మాట రాలేదు. మొహం పువ్వులాగ ఎర్రబడింది. చివరికి తెప్పరిల్లి, వణుకుతున్న కంఠస్వరంతో ఇలా అంది: “నువ్వు పుచ్చుకుని ఉండకూడదు !” ఆమె ఇంత బాధపడినందుకు నేను ఆశ్చర్యపడ్డాను. కాని, నా అబద్ధం బయటపడలేదు. అమ్మ కోపం ఆయన మీదే కాని, నామీద కాదు ! కాసేపు తర్వాత ఆమె అంది : “అమ్మా, నువ్వు ఈ పూల సంగతి ఎవరితో చెప్పకూ !” అని. వాటిని అవతల పారేస్తుందనుకున్నాను కాని జాగ్రత్తగా ఒక సెజ్జలో పెట్టి, ఆర్గన్ మీద ఉంచింది. అలా రేకులన్నీ ఎండిపోయేదాకా అక్కడే ఉంచి, తర్వాత కాడలు కోసేసి 'తలల్ని' ప్రార్థన గీతాల పుస్తకంలో పెట్టింది.

ఆరోజు సాయంత్రం మా కొత్త బాబాయిని చూడటానికని వెళ్లాను. ఆయన వళ్లో కూర్చుని బొమ్మల పుస్తకం చూస్తూంటే ఒక శబ్దం విని గాబరాపడిపోయాడు ఆయన. లోపల గదిలోనుంచి 'ఆర్గన్' వాద్యం శబ్దం వినిపిస్తోంది. మా అమ్మే అయి ఉంటుందనుకుని చూసేందుకు లోపలికి పరిగెత్తాను. దీపం వెలిగించి లేదు కాని వెన్నెల కాంతిలో తెల్లని బట్టలు వేసుకుని ఆర్గన్ దగ్గిర కూర్చున్న మా అమ్మ కనిపించింది. కిండర్ గార్డెన్ మలో మా టీచర్ కన్నా బాగా వాయించింది. దగ్గిరగా వెళ్లి నుంచున్నాను. కాని, ఆమె నన్ను చూసినట్లు లేదు. వాయిస్తూనే ఉండిపోయింది. ఆ తర్వాత పాడటం కూడా ప్రారంభించింది. ఆవిడ గొంతుక అంత అందంగా ఉంటుందని నాకు తెలీదు.

ఒకరోజు రాత్రి ఈ బాబాయి నుంచి తిరిగి రాబోతూ ఉండగా ఆయన నా కొక తెల్ల కవరు ఇచ్చాడు. మా అమ్మ చేతికి ఇవ్వమన్నాడు. “ఇది పోయిన నెల అద్దె, భోజనం ఖర్చులకి” అన్నాడు. అది మా అమ్మ కివ్వగానే ఆవిడ తెల్లపోయింది. కంగారుపడినట్టు కనిపించింది. “అద్దె భోజనం ఖర్చులకి అని చెప్పమన్నాడు” అన్నాను. దానితో తెప్పరిల్లింది. తర్వాత ఆమె మొహం ఎర్రబడింది. కవరు తెరిచి చూచింది. కొన్ని నోట్లు ఉన్నాయి. హాయిగా ఊపిరి తీసింది. కాని, ఇంతలో ఆమె ముఖంలో ఆశ్చర్యరేఖలు కనిపించాయి. లోపలనుంచి మడిచి ఉన్న చీటీ ఒకటి తీసింది. కొంచెం సందేహించి దాన్ని విడమరిచి చదివింది. దానిమీద ఏమి రాసిఉందో నాకు తెలీదు కాని, ఆమె చేతులు వణకటమే కాకుండా మొహం ఎర్రబడి పోయింది కూడా. కొంతసేపు తర్వాత ఆ చీటిని మడిచి డబ్బుతోపాటు తన కుట్టు సంచీలో పడేసింది. పడేసి మరికొంతసేపు నిశ్చలంగా కూర్చుని ఉండిపోయింది. ఊపిరి మాత్రం ప్రయాసతో తీసి వదులుతోంది. మా అమ్మకు జబ్బు చేస్తుందేమో అని భయపడ్డాను. “అమ్మా, ఇక పడుకుందాంరా” అన్నాను. “సరే!”అని నన్ను ముద్దు పెట్టుకుంది.

కొంతసేపటి తర్వాత నాకు మెలకువ వచ్చింది. మా అమ్మకోసం చెయ్యి చాపి తడిమి చూశాను. కాని, అక్కడ లేదు. భయంవేసి తల ఎత్తి చూశాను. కిటికీలోంచి పడుతున్న తెల్లటి వెన్నెలతో గదంతా వెలుతురుగా ఉంది.. ఒకమూల మా నాన్న బట్టలన్నీ ఉంచే ఒక పెద్ద పెట్టె దగ్గిరగా, తన తెల్ల పైజామాలలో కూర్చుని ఉంది అమ్మ. తనలో తనే ఏదో మాట్లాడుకుంటోంది. దగ్గరికి వెళ్లి వళ్లో కూర్చుని “ఏమిటమ్మా చేస్తున్నావు ?” అని అడిగాను. మాట్లాడుకోవటం మానేసి కళ్లు తెరిచింది. ఎంతోసేపు నావైపే చూసింది. తర్వాత మృదువుగా అంది :

“అమ్మా, ఓక్— హీ!”

“ఏమిటమ్మా ?”

“పడుకో వెళ్లి.”

“నువ్వూ రావూ ?”

“ఇదుగో వస్తున్నా” అంది. ఆమె మాటలు విచారంగా ఉన్నట్లు అనిపించాయి నాకు.

ఈ రోజుల్లో మా అమ్మని అర్థం చేసుకొనటం కష్టం. అంతకి మునుపు ఎన్నడూ చెయ్యని పన్లు ఎన్నో చేసేది.

సాయంత్రాల వేళల్లో ఆర్గన్ వాయించేది. కొన్నిసార్లు పాట కూడా పాడేది. నేను సంతోషంతో వినేదాన్ని. అయినా చాలాసార్లు పాడుతున్న దల్లా వెక్కివెక్కి ఏడ్వటం మొదలుపెట్టేది.

ఒక ఆదివారంనాడు — కిండర్ గార్డెన్ వేసవి సెలవులకి మూసేశారు—తల నెప్పిగా ఉందని మా అమ్మ చర్చికి పోలేదు. మే మిద్దరం తప్ప ఇంట్లో వేరెవరూ లేరు. నన్ను పిలిచి ఇలా అడిగింది, “అమ్మా, మీ నాన్నని చూడాలని ఉందా ?”

“ఓ, నాకు నాన్న కావాలి” అన్నాను నేను. కొంతసేపు మా అమ్మ ఏమీ మాట్లాడలేదు. చివరికి నెమ్మదిగా అంది :

“అమ్మా, నువ్వు పుట్టేముందే మీ నాన్న పోయాడు. నీ తండ్రి ఇక్కడలేడిప్పుడు. కాని, నీకు క్రొత్త తండ్రి ఉండటానికి వీల్లేదు. ఉంటే ఇక్కడి మనుష్యులంతా నిన్నూ, నన్నూ తిడతారు. నీకు లోకంతీరు తెలీదు. ఇక్కడివాళ్లు నిన్ను తిడతారు. మీ స్నేహితులంతా నిన్ను చూసి నవ్వుతారు. నీకొక మంచి కుర్రాడితో పెళ్లి అవదు. ఎంత బాగా చదివినా నిన్నెవరూ పొగడరు !” ఇంకా ఇలా అంది నాతో : “ఓక్— హీ నన్ను వదలకూడదు నువ్వు ! మీ అమ్మతోనే ఉండు. నేను ముసలిదాన్నయినా సరే, నాతోనే ఉండు ..... కిండర్ గార్డెన్, గ్రామర్ స్కూల్, హైస్కూల్—అన్నీ పూర్తిచేసి యూనివర్సిటీకి వెళ్లినా సరే. ఓక్—హీ నేనంటే నీ కెంత ప్రేమ ? చెప్పగలవా ?”

“ఇంత !” అన్నాను రెండు చేతులూ చాపుతూ.

“ఓ హీ, అంతా! మంచిదే! ఎప్పుడూ మీ అమ్మంటేనే నీకు ప్రేమ కదూ ! స్కూలు కెళ్లి బాగా చదువుకుని చక్కటి అమ్మాయిగా ఎదిగినా ? అంతేనా ?”

“అవునమ్మా, నువ్వంటే నా కెంత ఇష్టం !” అని నేను చేతులు రెండూ వెడంగా ఇంకా వెనక్కి

చాపాను. "అవును తల్లి, మీ అమ్మకు తక్కినవా ళ్లనవసరం. ఎందుకూ పనికిరారు !" అంటూ మా అమ్మ నన్ను గట్టిగా కావలించుకుంది.

తెల్లవారింది. రోజంతా గడిచింది. సాయంత్రం మా అమ్మ నన్ను పిలిచి, తల దువ్వి, కొత్త బట్టలు తొడిగింది. ఎక్కడికి వెడుతున్నానని అడిగాను. "నువ్వెక్కడికీ వెళ్లటంలేదు," అంది నవ్వుతూ ఆర్గన్‌మీద నుంచి, మడిచి ఉన్న తెల్లని రుమాలు ఒకటి తీసి ఇస్తూ "ఇది .... ఇది ఈ బాబాయి రుమాలు. ఆయనకిచ్చేసి వెంటనే తిరిగి వచ్చేసెయి" అంది. రుమాలు లోపల ఏదో కాగితం ముక్క ఉన్నట్లు దానిని తీసుకుపోయేప్పుడు గ్రహించాను. మా బాబాయికి ఇచ్చాను. ఈసారి ఆయన వాలకం పూర్తిగా మారిపోయింది. నన్ను చూసి నవ్వనే లేదు.

ఓరోజు మధ్యాహ్నం ఆయన గదిలోకి వెళ్లాను. సామాను కట్టేస్తున్నాడు. రుమాలు చేతికిచ్చినప్పటి నుంచి మనిషి మారిపోయాడు. విచారంగా ఉండేవాడు. ఎక్కువ మాట్లాడకుండా నావంకే చూస్తూ ఉండిపోయాడు. విసుగుపుట్టి ఆయన దగ్గరికి వెళ్లటం మానేశాను. కాని, ఇప్పుడు ఇలా సామాను మూట కట్టటం చూసి ఆశ్చర్యపడ్డాను. అమ్మ దగ్గరికి పరుగెత్తాను.

"అమ్మా, బాబాయి ఎందుకని వెళ్లిపోతున్నాడు ?"

"స్కూలు మూసేశారు కాబట్టి !"

"ఎక్కడికి వెళ్లిపోతున్నాడు ?"

"వాళ్ల ఇంటికి."

"మళ్లీ తిరిగి వస్తాడా ?"

మా అమ్మ జవాబు చెప్పలేదు. మధ్యాహ్నం బాబాయి వెళ్లిపోయిన తర్వాత ఆయనిచ్చిన బొమ్మతో ఆడుకుంటున్నాను. అమ్మ వంటగది లోంచి వచ్చింది.

"కొండమీదికి పోదామా ?" అంది.

"ఓ, తప్పకుండా ! నాకు చాలా యిష్టం ! రా!"

ఇద్దరం కొండపైకి ఎక్కి వెళ్లాము, చేతులు పట్టుకుని. మలుపు తిరిగి వచ్చింది. రైలుబండి. ఈల వేసుకుంటూ వచ్చి స్టేషన్‌లో ఆగింది. వెంటనే మళ్లీ బయలుదేరి వెళ్లిపోయింది.

మేము దిగి, ఇంటికి వచ్చేసిన తరువాత అమ్మ లోపలికి వెళ్లి ఆర్గన్ పెట్టె మూసేసి తాళం వేసింది. దానిమీద కుట్టు సంచీ ఉంచింది. ఆపైన ప్రార్థన గీతాల పుస్తకం తెరిచి, లోపల వత్తి ఉన్న ఎండు పువ్వులని తీసి, "వీటిని అవతల పారెయ్యి !" అంది. అదే సమయంలో మా ఇంటి గేటు తెరుచుకుని వచ్చాడు గుడ్లు అమ్మే మనిషి.

"ఇకపైన గుడ్లు కొనము ! ఇక్కడ గుడ్లు తినేవారెవరూ లేరు," అంది నిర్జీవమయిన, నెమ్మది గొంతుకతో. నాకు గుడ్లు కొన్ని కొని పెట్టమని అడుగుదా మనుకున్నాను కాని పాలిపోయిన ఆమె మొహం చూసి ధైర్యం చాలక ఆగిపోయాను. నా బొమ్మ చెవిలో రహస్యంగా అన్నాను.

"అమ్మ అబద్ధం చెప్పింది. నాకు గుడ్లంటే ఇష్టమని అమ్మకి తెలుసు. కాని, అమ్మ వంట్లో బావున్నట్లు లేదు. పాలిపోయి ఉంది. ఇప్పుడు దేనికోసమూ అడగను !" ★

